
andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.8 కనిష్ఠం 25.7



నిర్మల్ జిల్లా వార్తలు

8

శుక్రవారం 9 ఆగస్టు 2024

గడ్డెన్నవాగు ప్రాజెక్టు ఆయకట్టుకు సాగునీరు గగనమే!



భైంసా, ఆగస్టు 8 : ప్రతికూల పరిస్థితులతో ఈ ఏడు కూడా గడ్డెన్నవాగు ప్రాజెక్టు ద్వారా ఆయకట్టు సాగునీరు అందే పరిస్థితులు లేవు. ప్రాజెక్టుపై ఆశలు పెట్టుకొని సాగుకు ఉపక్రమించిన అన్నదాతలకు సాగునీటి వెతలు తప్పేటట్లు లేవు. ఎగువప్రాంతంలోని మహారాష్ట్రంలో అంతంత మాత్రంగానే వర్షాలు కురియడంతో ప్రాజెక్టులోకి వరదనీరు నామమాత్రంగానే వచ్చి చేరుతోంది. వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలకు పైగానే కాలం గడిచినప్పటికీ ప్రాజెక్టులోకి చెప్పుకోతగ్గ వరదనీరు వచ్చి చేరలేదు. ప్రాజెక్టులోకి ఈ సీజన్‌లో ఇప్పటి వరకు కేవలం 0.408 టీఎంసీల వరదనీరు మాత్రమే వచ్చి చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 358.7 మీటర్లు ఉండగా నీటి నిల్వల సామర్థ్యం 1.852 టీఎంసీలుగా ఉంది. అయితే ప్రాజెక్టులో ఇక్కడి ప్రాంతానికి మిషన్ భగీరథ పథకానికి తాగునీటిని అందించేందుకు 1.286 టీఎంసీల మేర నీటినిల్వలు ఉంచాల్సి ఉంది. అయితే ప్రస్తుతం ప్రాజెక్టు నీటి మట్టం 357 మీటర్లు, 1.084 టీఎంసీల నీటినిల్వలు ఉన్నాయి. మిషన్ భగీరథ పథకం కోసం నిల్వగా ఉంచాల్సిన 1.286 టీఎంసీల నీటి పరిమితికి సైతం ప్రాజెక్టు నీటినిల్వలు చేరుకోలేదంటే పరిస్థితి ఏ విధంగా ఉందో చెప్పకుండానే తెలిసిపోతోంది.

14 వేల ఎకరాల ఆయకట్టు

రూ.180 కోట్లకు పైగా వ్యయంతో నిర్మించిన ప్రాజెక్టు ద్వారా 14 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాల్సి ఉంది. ఇందుకు గాను 43 కిలోమీటర్ల మేర ప్రధాన కాలువ నిర్మించారు. రూ.21 కోట్లతో కాలువ ఆధునీకరణ పనులు చేపట్టారు. ఈ నిధుల ద్వారా ఇప్పటి వరకు అర్థ శాతానికిపైగా కాలువకు సీసీ పనులు పూర్తి చేశారు. ప్రాజెక్టు ప్రధాన కాలువ ద్వారా వానకాలంలో ఆయకట్టు కింద 6 వేల ఎకరాలకు పైగానే సాగునీరు అందుతోంది. వేసవికాలం పంటలకు 2 వేల ఎకరాలకు పైగా సాగునీరు అందుతోంది. అయితే ప్రస్తుతం ప్రాజెక్టులో నీటి నిల్వలు నామమాత్రంగా ఉండటంతో ఆయకట్టు భూములకు ప్రధాన కాలువ ద్వారా సాగునీరు అందే పరిస్థితులు లేకుండా పోయాయి. ప్రాజెక్టు నీటిలో మిషన్ భగీరథ కోసం 1.286 టీంఎసీల నీటినిల్వలు ఉంచి మిగతా నీటిని ఆయకట్టు పరిధిలోని సాగులోనున్న పంటలకు కేటాయించాల్సి ఉంటుంది. అయితే ప్రస్తుతం ప్రాజెక్టులో మిషన్ భగీరథ కోసం నిల్వగా ఉంచాల్సిన నీటి నిల్వల కంటే 0.202 టీఎంసీల నీటినిల్వలు తక్కువగా ఉన్నాయి. దీంతో ఆయకట్టు భూములకు సాగునీరు అందించే పరిస్థితులు లేకుండా పోయాయి.

- ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 1.852 టీఎంసీలు
- ప్రస్తుత నీటి నిల్వలు 1.084 టీఎంసీలు
- మిషన్ భగీరథ కోసం అవసరమైన నీటి నిల్వలు 1.286 టీఎంసీలు
- మిషన్ భగీరథ సామర్థ్యానికి తక్కువగానున్న నీటినిల్వలు 0.202 టీఎంసీలు

ప్రాజెక్టులో ప్రస్తుతం నీటి నిల్వలు 1.084 టీఎంసీలు

ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో కురిసిన నామమాత్రపు వర్షాల మూలంగా ప్రాజెక్టులోకి వరద నీరు అంతంత మాత్రంగానే వచ్చి చేరింది. ఈ కారణంగా జూలై మాసం ఆరంభంలో ప్రాజెక్టు నీటిమట్టం 355.8 మీటర్లు , 0.704 టీఎంసీల నీటి నిల్వలు ఉండగా ఆగస్టు 8వ తేదీ వరకు నెల రోజులకు పైగా కాల వ్యవధిలో ప్రాజెక్టులోకి కేవలం 0.408 టీఎంసీల వరదనీరు మాత్రమే వచ్చి చేరింది. దీంతో ప్రాజెక్టు నీటిమట్టం 1.2 మీటర్ల మేర పెరిగి 357 మీటర్లకు, నీటినిల్వలు 1.084 టీఎంసీలకు చేరుకున్నాయి. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వల సామర్థ్యం 1.852 టీఎంసీలు ఉండగా ప్రస్తుత నీటినిల్వలు 1.084 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. గత రెండు రోజులుగా ఎగువ ప్రాంతంలో వర్షాలు లేకపోవడంతో ప్రాజెక్టు నీటి మట్టం 357 మీటర్లతో నిలకడగానే కొనసాగుతోంది.

మిషన్ భగీరథ కోసం 1.286 టీఎంసీ నీటి నిల్వలు

భైంసా డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాలకు మిషన్ భగీరథ పథకం కింద గడ్డెన్న వాగు ప్రాజెక్టు నీటిని అందిస్తున్నారు. ఇందు కోసం గాను ప్రాజెక్టులో 1.286 టీఎంసీల నీటి నిల్వలు ఉంచాలని ప్రభుత్వం నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించింది. జీవో ఆర్‌టీ నెంబర్ 855 ఉత్తర్వుల ప్రకారం ప్రాజెక్టులో తప్పనిసరిగా అన్ని కాలాల్లోనూ 357.5 మీటర్ల నీటిమట్టం, 1.286 టీఎంసీల నీటినిల్వలు నిర్వహణ చేయాలని లేని పక్షంలో అధికారులపై చర్యలు తప్పవని సంబంధిత ఉత్తర్వులో పేర్కొన్నారు. ప్రస్తుత ప్రాజెక్టు నీటిమట్టం 357 మీటర్లు, నీటి నిల్వలు 1.084 టీఎంసీలుగా ఉన్నాయి. అయితే మిషన్ భగీరథ కోసం నిల్వగా ఉంచాల్సిన నీటినిల్వలే ప్రాజెక్టులో లేకుండా పోయింది. మిషన్ భగీరథ నిల్వల కోసమే ప్రాజెక్టులోకి మరో 0.202 టీఎంసీల వరద నీటి అవకశ్యత నెలకొని ఉంది. ప్రాజెక్టు నీటిమట్టం 357 మీటర్ల నుంచి 357.5 మీటర్లకు చేరి, నీటినిల్వలు 1.084 టీఎంసీల నుంచి 1.286 టీఎంసీలకు మించి పెరిగితే తప్ప ఆయకట్టు భూములకు సాగు నీటిని అందించే పరిస్థితులు లేకుండా పోయాయి.

ఆందోళనలో ఆయకట్టు రైతాంగం

ప్రస్తుతం నెలకొని ఉన్న పరిస్థితులతో ప్రాజెక్టు ద్వారా ఈ ఏడు సాగునీరు అందే పరిస్థితులు లేవనే సమాచారంతో ఆయకట్టు రైతాంగం ఆందోళన చెందుతోంది. జూలై మాసంలో ప్రాజెక్టు దిగువ, ఆయకట్టు పరిధిలో ఓ మాదిరిగా కురిసిన వర్షాలతో రైతాంగం అధిక మొత్తంలో సాగుకు ఉపక్రమించింది. ముప్పాతిక శాతం మంది ఆయకట్టు రైతులు వరినాట్లు వేసుకోగా మిగతా రైతులు వరినాట్లను ముమ్మరం చేశారు. అడపాదడపా కురిసిన వర్షాలతో నాట్లు పూర్తి చేసుకున్న రైతాంగం తదుపరి సాగునీటిపై ఆందోళన చెందుతున్నారు. ప్రాజెక్టు ద్వారా సాగు నీటి విడుదల కాకపోతే తమ పంటల పరిస్థితి ఎలా అనే బెంగతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు.

నిరాశాజనకంగా వరద నీటి చేరిక

ప్రతికూల వాతరవణ పరిస్థితులతో ప్రాజెక్టులోకి వరద నీటి చేరిక నిరాశాజనకమైన స్థితిలో ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టులోని నీటి నిల్వలతో ఆయకట్టు భూములకు సాగు నీటిని అందించే పరిస్థితులు లేవు. ప్రాజెక్టులోని నీటి నిల్వల్లో సింహభాగం మిషన్ భగీరథ నిర్వహణ కోసం కేటాయించిన నేపథ్యంలో ప్రస్తుతమున్న నీటి నిల్వలతో సాగు నీటిని అందించడానికి వీలు లేకుండా ఉంది. సాగునీటి విషయంలో ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటాం.

అనిల్‌కుమార్, డీఈఈ, గడ్డెన్నవాగు ప్రాజెక్టు, భైంసా

పంచమి వేడుకలకు ముస్తాబైన ఆలయాలు



1. భైంసా బాగుబాయి గుట్టపై నాగదేవత
2. మహారాష్ట్ర క్రాస్‌రోడ్డు సమీపంలో ముస్తాబైన నాగదేవత ఆలయం

భైంసా, ఆగస్టు 8 : పట్టణంలోని నాగదేవత ఆలయాలు పంచమి వేడుకల కోసం ముస్తాబు అయ్యాయి. శుక్రవారం నిర్వహించే నాగులపంచమి వేడుకలను పురస్కరించుకొని ఆలయాల కమిటీ నిర్వాహకులు ఘనమైన ఏర్పాట్లు చేపట్టారు.నాగదేవత ఆలయాలను రంగులతో సర్వంగా సుందరంగా ముస్తాబు చేశారు, విగ్రహాలను శోభయమానంగా అలంకరించారు. పరిసర ప్రాంతాలను శుభ్రపరిచారు. పట్టణంలోని బాగుబాయి గుట్ట సాయిబాబా మందిరంలోని మాంజ్రిరోడ్డు మార్గంలోని నాగదేవల ఆలయాలకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చే అవకాశము ఉండటంతో వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు గాను తగురీతిలో ఏర్పాట్లు చేపట్టారు. ఇక్కడి ప్రాంతంలో నాగులపంచమిని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. పలు సంఘాలు రెండు నాగదేవత మందిరాల వద్ద ప్రసాదాల వితరణ కోసం గాను ఏర్పాట్లు చేపట్టారు.

● మార్కెట్‌కు నాగపంచమి కళ

ఇటీవల నామమాత్రపు కొనుగోళ్లతో వెలవెలబోయిన భైంసా మార్కెట్ నాగపంచమి కొనుగోళ్లతో గురువారం కళకళలాడింది. అధికసంఖ్యలో ప్రజలు కొనుగోళ్ల కొరకు గాను ఇక్కడికి తరలిరావడంతో ఇన్నాళ్లుగా బోసిపోయిన భైంసా మార్కెట్ సందడిగా కనిపించింది. ప్రధానంగా వస్త్ర వ్యాపారపు సంస్థలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. ఇతర ప్రాంతాల్లోనున్న ఇంటి ఆడపడుచులు నాగపంచమిని పురస్కరించుకుని పుట్టింటికి తరలిరావడంతో బస్టాండ్ కోలాహలంగా కనిపించింది. చాలా రోజుల తదుపరి భైంసా మార్కెట్ కొనుగోళ్ల ప్రక్రియతో కొత్తశోభను సంతరించుకుంది.పంచమి పండుగలో భాగంగా నాగ దేవతకు పూజలు నిర్వహించిన అనంతరం సోదరీ మణులంతా తమ తమ సోదరులకు కళ్లను కడుగడం అచారంగా కొనసాగుతోంది. ఇదే క్రమంలో కళ్లను కడిగిన సోదరిమణులకు సోదరులు కట్నకానుకలు, నూతన వస్త్రాలను సమర్పిస్తుంటారు. వీటన్నింటి కొనుగోళ్లు గురువారం ఇక్కడి మార్కెట్‌లో అధికమొత్తంలో జరిగాయి. దీంతో పాటు నాగపంచమి పర్వదినమున ప్రసాదంగా అందించే పంచమి ప్యాలాలకు భలే గిరాకీ జరిగింది.

ఘనంగా పాఠశాలలో నాగపంచమి వేడుకలు



శ్రీ సరస్వతీ శిశు మందిర్‌లో నాగ పంచమిని జరుపుకుంటున్న దృశ్యం

ముథోల్, ఆగస్టు 8 : ముథోల్ మండల కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో నాగపంచమి ఉత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్వయంగా పుట్టను, పాములను తయారు చేసి వాటికి పూజలు నిర్వహించారు. పుట్టలో పాలు పోసి దీపధూప నైవేద్యాలను అందించారు. ఆచార్యులు నాగపంచమి విశిష్టతను తెలియజేశారు. విద్యార్థులు సంతోషంతో పుట్ట చుట్టూ చేరి పాటలు పాడారు. ఆటలు ఆడారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా శంకర్ బాధ్యతలు స్వీకరణ



కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న ఈడీ

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 8 : నిర్మల్ జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా శంకర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన కలెక్టర్ అభిలాష అభినవ్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకొని మొక్కను అందజేశారు. ఆదిలాబాద్ నుంచి ఆయన నిర్మల్‌కు బదిలీపై వచ్చారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి : చైర్మన్ ఈశ్వర్



స్వచ్ఛదనం.. పచ్చదనంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 8 : పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ అన్నారు. గురువారం స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమం భాగ్యనగర్, షేక్‌సాబ్‌పేట్, కస్బా బాలికల పాఠశాలలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలన్నారు. సీజనల్ వ్యాధులు సోకకుండా ఉండాలంటే పచ్చదనం పెంచాలన్నారు. ప్లాస్టిక్ నిషేధించాలన్నారు. ఆయా ప్రాంతాల్లో మున్సిపల్ సిబ్బంది పిచ్చి మొక్కలు తొలగించి, పరిసరాలను శుభ్రం చేశారు. సానిటరీ ఇన్స్‌పెక్టర్ దేవిదాస్, కౌన్సిలర్లు అబ్రార్, ముజాహిద్ అలీ, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం తాగిన మత్తులో పొలం గుంటలో పడి వ్యక్తి మృతి



సంఘటన స్థలంలో వివరాలు సేకరిస్తున్న ఎస్సై సుమలత

లక్ష్మణచాంద, ఆగస్టు 8 : మద్యం తాగిన మత్తులో పొలం గుంటలో పడి మృతి చెందిన అతి ఆశ్చర్యకరణ సంఘటన మండలంలోని చంద్రాపూర్ (రాచాపూర్) గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై సుమలత, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... చంద్రాపూర్ గ్రామానికి చెందిన చిట్యాల అశోక్(52) అనే వ్యక్తి ట్రాక్టర్ నడుపుతున్న అతని చిన్న కుమారుడైన అరుణ్‌కు చద్దన్నం (లంచ్ బాక్స్) ఇవ్వడానికి పొలంలోకి వెళ్లి తిరిగి వస్తుండగా ఒడ్డు మీద నుండి కాలు జారి నారుమడి గుంటలో బోర్లా పడ్డాడు. అప్పటికే మద్యం తాగి ఉన్న అతను మత్తులో ఉన్న కారణంగా ఊపిరి ఆడక మృతి చెందినట్లు భావిస్తున్నామని వారు వెల్లడించారు. విషయం తెలిసిన మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆమె వివరించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

బీడీ కార్మికులకు రూ. 4,000 పెన్షన్ ఇవ్వాలి : సీపీఐ (ఎంఎల్)మాస్‌లైన్, ఐఎఫ్‌టీయూ





కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న బీడీ కార్మికులు

నిర్మల్ అర్బన్, ఆగస్టు 8 : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీ, జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం సమీకృత కలెక్టర్ కార్యాలయం ముందు 500ల మందితో ర్యాలీ చేసి, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి నందిరామయ్య, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కట్లరాజన్నలు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ముందు ప్రజలకు అనేక హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి ఏడు నెలలు కావస్తున్నా కూడా హామీల అమలులో నిర్లక్ష్యం వహిస్తుందని విమర్శించారు. ముఖ్యంగా ఇచ్చిన అన్ని హామీలతో పాటు ఆరు గ్యారంటీలను అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, రుణమాఫీని కూడా హామీ ఇచ్చిన ప్రకారం ఆగస్టు 15 లోపు రెండు లక్షల రూపాయలు ఎలాంటి ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలని, తప్పులు పడిన వేలాది మంది రైతుల పేర్లను సరిచేసి వారికి ఒకే షరతుగా రుణమాఫీ అందించాలన్నారు. అదేవిధంగా బీడీ కార్మికులకు, బీడీ ప్యాకర్స్‌కు, నెలసరి ఉద్యోగులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా చేయూత పథకం ద్వారా రూ. 4,000ల పెన్షన్ ఇవ్వాలన్నారు. పోడు సాగుదారులందరికీ పట్టాలను, సాగు హక్కులను కల్పించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి తెల్ల రేషన్ కార్డులు ఇవ్వాలని, ఇంటి స్థలం లేని వారికి ఇంటి స్థలాన్ని, గృహ నిర్మాణానికి రూ. 10 లక్షల రూపాయలను ఇవ్వాలని, అలాగే అర్హులైన వారందరికీ ప్రభుత్వ వాగ్దానం ప్రకారం పెన్షన్ ఇవ్వాలని, రైతాంగ రుణాలను రద్దు చేయాలని, పంటబీమా పథకం జూలై, ఆగస్టు నెలలో అమలు చేయాలన్నారు. ధరణి సమస్యలను వెంటనే పరిష్కరించాలని, కౌలు రైతుల గుర్తింపుకు నిర్దిష్ట చర్యలు చేపట్టాలని, వాస్తవ సాగుదారులందరికీ రైతు భరోసా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. భవన నిర్మాణ కార్మికులకు, ఇతర అసంఘటిత, కాంట్రాక్ట్ కార్మికులకు సెలవులతో కూడిన కనీస వేతనాలు అమలు చేయాలని, స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్లను, ఆరోగ్యశ్రీ బకాయిలను వెంటనే చెల్లించాలని, నిరుద్యోగ ఖాళీలపై శ్వేత పత్రం ప్రకటించి జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలన్నారు. ఖానాపూర్ డబుల్ బెడ్ రూమ్‌లో నివాసముంటున్న వారిని వెంటనే గుర్తించి ఇంటి పట్టాలు ఇవ్వాలి. ఖానాపూర్ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల ప్రక్కన తక్షణమే ప్రభుత్వ అధికారులు భూమి సర్వే నిర్వహించి, ఇళ్లు లేని నిరుపేదలకు మిగిలిన భూమిలో ఇందిరమ్మ గృహాలు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. రామ్ లక్ష్మణ్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు ఎం. బక్కన్న, పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కే. లక్ష్మీ, ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. గంగన్న, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు వాగ్మారే మహేందర్, జక్కుల రాజన్న, ఎం.అంకుష్‌రావు, కుంచెపు ఎల్లయ్య, రాజారాం, వందలాది మంది ప్రజలు, బీడీ కార్మికులు పాల్గొన్నారు.

కోతుల్‌గాంలో

పర్యటించిన అడిషనల్ కలెక్టర్



కోతుల్‌గాం గ్రామంలో పర్యటిస్తున్న అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

భైంసా రూరల్, ఆగస్టు 8 : మండలంలోని కోతుల్‌గాం గ్రామంలో అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ గురువారం పర్యటించారు. వివిధ గ్రామాల్లో గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. కార్యదర్శులు ప్రవీణ్ కుమార్ గత నాలుగు సంవత్సరాల నుంచి తాత్కాలికంగా విధులు నిర్వహించారు. ఉద్యోగరీత్యా బాధ్యతలు ఎలా నిర్వహిస్తున్నారని విషయంపై గ్రామ ప్రజలకు అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందు వలన పరిశుభ్రతను, స్వచ్ఛదనాన్ని, డ్రైనేజీ కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని పంచాయతీ సిబ్బందికి ఆదేశించారు. ఈయన వెంట ఎంపీడీవో సుధాకర్, ఎంపీవో మోజాం హుస్సేన్, మాజీ సర్పంచ్ భూమేష్ గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

తానూర్ , ఆగస్టు 8 : మండలంలోని ఏల్వీ గ్రామంలో గురువారం ఎంపీడీవో అబ్దుల్ సమద్, ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు భోజనం సేవించే ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

అవగాహనతో

ముందుకు సాగితే అన్నింటా సురక్షితం



అవగాహన కల్పిస్తున్న మిషన్ శక్తి జెండర్ స్పెషలిస్టులు జ్యోతి,మౌనిక

భైంసా, ఆగస్టు 8 : యువతులు, మహిళలు ప్రభుత్వం కల్పించే చట్టాలు, రక్షణ చర్యల సేవలపై అవగాహన పెంపొందించుకొని ముందుకు సాగితే అన్నింటా సురక్షితంగా ఉండటం సాధ్యమవుతుందని మిషన్ శక్తి జెండర్ స్పెషలిస్టులు జ్యోతి, మౌనికలు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ మహిళా సాధికారిత కేంద్రం (మిషన్ శక్తి) ఆధ్వర్యంలో బాలికలకు చట్టాలు,రక్షణ చర్యల సేవలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుందన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. లింగ వివక్షత, సమానత్వం, ఫోక్స్ చట్టాలను వివరించారు. సఖీ సర్వీసులను తెలిపారు. బాలికలు, ఉమెన్స్ హెల్ప్ లైన్ నెంబర్ల వినియోగం పై తెలియచెప్పారు. అపత్కాలంలో టోల్‌ఫ్రీ నంబర్ కాల్ ను సద్వినియోగం చేసుకోవాలని విశదీకరించారు. సైబర్ నేరాలపై అన్ని వేళల అప్రమత్తంగా వ్యవహరించాలని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ స్వర్ణ మంజుల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వర్ష సమాచారం

నిర్మల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో క్రమం తప్పకుండా వర్షాలు కురుస్తున్నాయి. గురువారం జిల్లాలో నమోదైన వర్షపాతం వివరాలు ఈ విధంగా ఉన్నాయి. జిల్లా సగటు వర్షపాతం 7.1 మిల్లీమీటర్లు కాగా అత్యధికంగా లక్ష్మణచాంద మండలంలో 10.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే జిల్లాలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టు కడెం ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వరదనీటి ప్రవాహం కొనసాగుతుంది. కడెం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 7.653 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ సామర్థ్యం 6.874 టీఎంసీలుగా ఉంది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతం నుంచి 1823 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుంది. అలాగే స్వర్ణ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 1.484 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ సామర్థ్యం 1.385 టీఎంసీలుగా ఉంది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతం నుంచి 230 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. అలాగే గడ్డెన్న వాగు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 1.852 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ సామర్థ్యం 1.084 టీఎంసీలుగా ఉంది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతం నుంచి 100 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది.

పాలిటెక్నిక్ మిగులు సీట్లకు

12న స్పాట్ అడ్మిషన్లు

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 8 : జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కోర్సులలో మిగిలిన సీట్లను 12న స్పాట్ అడ్మిషన్లతో భర్తీ చేస్తామని ప్రిన్సిపాల్ టి. రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్, ఇంజనీరింగ్, డిప్లొమా కోర్సులలో ఈ అడ్మిషన్లు ఉంటాయన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 11న సంబంధించిన సర్టిఫికెట్ జిరాక్స్ ప్రతులను జతచేసి కాలేజీలో సమర్పించాలని సూచించారు. వివరాలకు 9908864830 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

ఒకరి అదృశ్యం



కుంటాల, ఆగస్టు, 8: కుంటాల మండలంలోని లింబా (కే) గ్రామానికి చెందిన సతీష్ (34) అనే యువకుడు అదృశ్యమైనట్లు ఎస్సై రజనీకాంత్ తెలిపారు. నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం సుభాష్‌నగర్‌కు చెందిన సతీష్ మండలంలోని లింబా (కే) గ్రామంలో నివాసముంటు న్నాడు. ఇతను గత నెల 12 న భార్యతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు అతని భార్య ఫిర్యాదు చేసిం దని తెలిపారు. ఇతను ఇది వరకు రెండు, మూడు సార్లు ఇంట్లో నుండి బయటకు వెళ్లిపోయి వారం, పది రోజులకు తిరిగి వచ్చాడని భార్య తెలిపినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఆచూకి తెలిస్తే కుంటాల పోలీసుస్టేషన్ సమాచారం ఇవ్వాలన్నారు. .

సీజనల్ వ్యాధుల నివారణ సర్వే

నర్సాపూర్(జి), ఆగస్టు 8 : సీజనల్ వ్యాధుల నివారణ వ్యూహంలో భాగంగా మండల కేంద్రంలో ఇంటింటికీ తిరిగి జ్వరాల సర్వే నిర్వహిస్తున్నట్లు మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి వీణారెడ్డి తెలిపారు. సర్వే బృందంలో సహాయక నర్సులు, సోషల్ హెల్త్ యాక్టివిస్ట్, మల్టీ పర్పస్ హెడ్ అసిస్టెంట్, హెల్త్ సూపర్‌వైజర్ ప్రతీ నిత్యం యాభై గృహాలను సర్వే చేస్తున్నట్లు తెలిపారు.

పశువులను రోడ్లపై వదిలితే గోశాలలకు తరలిస్తాం

● ఉట్నూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి

ఉట్నూర్, ఆగస్టు 8: పశువులను రోడ్లపై వదిలితే గోశాలకు తరలిస్తామని ఉట్నూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి శంకర్ హెచ్చరించారు. రోడ్లపై పశువులను వదిలితే ముందుగా బంజారు దొడ్డిలో వేసి ఆ తర్వాత గోశాలకు తరలిస్తామన్నారు. రోడ్లపై పశువులను వదిలేయడం వల్ల విద్యార్థులు, ఉద్యోగులు, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. పశువుల యజమానులు ఇప్పటికైనాపశువులను రోడ్లపై వదలకూడదని కోరుతున్నాం. ఈ విషయంలో గ్రామ పంచాయతీ సిబ్బందికి ఎలాంటి ఆటంకాలు కలిగించినా పోలీసులు కేసులు నమోదు చేస్తారని హెచ్చరించారు.



ఇచ్చోడలో వేలంపాట నిర్వహిస్తున్న ఆబ్కారీ శాఖ అధికారులు

వాహనాల వేలంలో ఆబ్కారీకి భారీ ఆదాయం

ఇచ్చోడ, జూన్ 8: గుడుంబా, గంజాయి తదితర కేసుల్లో పట్టుబడ్డ ఆరు ద్విచక్ర వాహనాలకు గురువారం జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ హిమశ్రీ ఆధ్వర్యంలో వేలం వేసినట్లు ఆబ్కారీశాఖ సీఐ జుల్ఫికర్ అహ్మద్ తెలిపారు. ఇందులో నాలుగు వాహనాలకు వేలంకాగా మరో రెండు వాహనాలు అలాగే ఉండిపోయాయని తెలిపారు. నాలుగు వాహనాల విలువ ఆర్టీవో, ఆబ్కారీ అధికారులు రూ.71,700 నిర్ణయించగా.. వేలం పాటలో నాలుగు వాహనాలకు లక్షా 12వేల 500 రూపాయలు వచ్చాయన్నారు. జీఎస్టీ ద్వారా రూ.20250 నగదు వచ్చిందని తెలిపారు. మొత్తం ఆదాయం రూ.1,32,750 నగదు రూపంలో వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ఇందులో రెండు వాహనాలు స్క్రాప్ కింద, మరో రెండు వాహనాలు రోడ్‌వే రూపంలో వేలం వేయడం జరిగిందని ఆయన తెలిపారు.



జోగు రామన్నను పరామర్శిస్తున్న పలు పార్టీల నాయకులు

మాజీ మంత్రి జోగు రామన్నకు సోదరవియోగం

● బాధిత కుటుంబాన్ని పరామర్శించిన పలువురు నాయకులు

జైనథ్, ఆగస్టు8: మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్న జోగుపోతారెడ్డి (72) గురువారం అనారోగ్యంతో జైనథ్ మండలంలోని దీపాయిగూడలో మృతిచెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు, ఆయా సంఘాల నాయకులు జోగురామన్నను పరామర్శించారు.

జోగు పోతారెడ్డి భౌతిక కాయానికి నివాళులర్పించిన నాయకులు

ఆదిలాబాద్అర్బన్: మాజీ మంత్రి జోగురామన్న సోదరుడు జోగుపోతారెడ్డి అనారోగ్యంతో మృతిచెందగా విషయం తెలుసుకున్న పలువురు నాయకులు ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించారు. పోతారెడ్డి భౌతికకాయాన్ని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అయనతో పాటు డీసీసీబీ చైర్మన్ అడ్డిభోజారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నాయకులు గిమ్మా సంతోష్, లోకప్రవీణ్‌రెడ్డి, కౌన్సిలర్లు సందనర్సింగ్, భూమన్న, ఇమ్రాన్, నాయకులు ఎం.ఎ షకీల్, బాయిన్‌వార్ గంగారెడ్డి, యాల్లపోతారెడ్డి, అల్లూరి భూమారెడ్డి, దేవిదాస్‌చారి, అల్లూరి అశోక్‌రెడ్డి, పుంద్రుప్రవీణ్‌రెడ్డి, ఏనుగు ప్రమోద్‌రెడ్డి, అల్లూరి సతీష్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, హరీస్‌రెడ్డి, బండారి చిన్నయ్య, తమ్మలవార్‌చందు, సింగిరెడ్డిరామ్‌రెడ్డి, ఎల్టిభోజారెడ్డి, ఎంఎ కయ్యూమ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలి: జెడ్పీ సీఈవో

బోథ్, ఆగస్టు8: మొక్కలు నాటి వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందని జెడ్పీ సీఈవో కళిందిని పేర్కొన్నారు. గురువారం మండలంలోని కుచలాపూర్ వెంకటేశ్వర ఆలయంలో మొక్కలు నాటారు. అనంతరం గురుకుల కళాశాలలో కిచెన్ గార్డెన్, కంపోస్ట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్గానిక్ వెజిటేబుల్స్ యొక్క ఉపయోగాల గురించి వివరించారు. మరిన్ని ప్రాంతాల్లో నాటాలని సూచించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించి కార్యాలయ పరిసరాల పరిశుభ్రత గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజాపాలన సేవా కేంద్రం యొక్క దరఖాస్తుల నమోదు ప్రక్రియను రిజిస్టర్‌లో నమోదు చేసిన వివరాలను పరిశీలించి తగు సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, జూనియర్ వైస్ ప్రిన్సిపల్ మాధవి, ఎంపీడీవో జీవన్ రెడ్డి, ఏపీవో జగ్దీరావు, డిసీఎస్ఓ కిరణ్‌కుమార్, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

జ్వరంతో యువతి మృతి

ఇంద్రవెల్లి, ఆగస్టు8: మండలంలోని తుమ్మగూడ గ్రామానికి చెందిన కొట్నాక్ జ్యోతి (22) జ్వరంతో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గత రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు ఆమెను మండల కేంద్రములోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స అందించారు. బుధవారం రాత్రి తీవ్ర అస్వస్థతకు గురవడంతో గురువారం జిల్లాకేంద్రంలోని రిమ్స్‌కు తరలించగా అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు పేర్కొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజార్షిషా



పాల్గొన్న ఆయా శాఖల అధికారులు

పంద్రాగస్టుకు పకడ్బందీగా ఏర్పాట్లు: కలెక్టర్

ఆదిలాబాద్అర్బన్, ఆగస్టు8: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజార్షిషా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవం వేడుకలకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఆయా శాఖల వారీగా అధికారులకు దిశా నిర్దేశం చేశారు. పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో వేడుకలు నిర్వహించనున్నందున వేదిక, సిట్టింగ్ ఏర్పాట్లను పక్కాగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఎలాంటి లోటు పాట్లకు తావు లేకుండా వేడుకలు సజావుగా జరిగేలా ఆయా శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా జిల్లాప్రగతి నివేదిక రూపొందించాలని ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యానవన, జిల్లా గ్రామీణా భివృద్ధి, ఫారెస్టు, విద్య, వైద్యం, స్త్రీశిశు సంక్షేమం తదితర శాఖల శకటాల ప్రదర్శనతోపాటు స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. గృహజ్యోతి, మహాలక్ష్మి, రూ.500లకు గ్యాస్ కనెక్షన్, రైతురుణమాఫీ, రైతుభరోసా, వనమహోత్సవం తదితర పథకాలపై శకటాలు, స్టాల్స్ ఉండాలన్నారు. ప్రొటోకాల్‌ను అనుసరిస్తూ అతిథులకు ఆహ్వానాలు పంపాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులతో సాంస్కృతిక ప్రత్యేక అధికారులు అందుబాటులో లేని పక్షంలో మండల కంపేంద్రాలలో ఎంపీడీఓలు, గ్రామ పంచాయతీలలో పంచాయతీ కార్యదర్శులు జెండావిష్కరణ చేయవచ్చని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్ మాలవీయ, ఆయా శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకే మహిళాశక్తి

మహిళా వికాస జిల్లా సమాఖ్య కార్యవర్గ సమావేశం జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ కార్యాలయంలో సెర్ప్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ రాజార్షిషా ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళాశక్తి కార్యక్రమంలో భాగంగా 217 కొత్త సంఘాలను 5570 మంది మహిళలను మహిళా సంఘాల్లో చేర్పించడం, బ్యాంకు లింకేజి ద్వారా 4965 మహిళా సంఘాలకు రూ.105.57 కోట్లను జూలై నెలవరకు లక్ష్యం నిర్దేశించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా మరింత ప్రగతిబాటలో పయనింప చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం మహిళాశక్తి కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఇప్పటికే పాఠశాల విద్యార్థులు ఏకరూప దుస్తులను కుట్టి ఇచ్చే బాధ్యతలతో పాటు, అమ్మఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ బడులలో పనులను సైతం స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా కొనసాగిస్తుందన్నారు. మహిళాసంఘాల ద్వారా ఆదాయం పెంపొందించే దిశగా శిల్పారామంలో, గాంధీ పార్కులో స్టాల్స్ ఏర్పాటు చేసి ఉపాధి పొందాలని సూచించారు. వివిధ రకాలబ్యాగ్స్, మగ్గంవర్క్, పుడ్, అగరవత్తులు, ఇతర యూనిట్స్ తయారు చేయాలన్నారు. అనంతరం జూట్ బ్యాగులను ప్రారంభించి మహిళా సమాఖ్య సంఘాలతో భోజనం చేశారు. ఇందులో డీఆర్డీఓ సాయన్న, మహిళా సంఘాల అధ్యక్షులు, డీపీఎం, ఏపీఎం తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు గుంతల పూడ్చివేత

● పోలీసులపై ప్రశంసల జల్లు

ఉట్నూర్, ఆగస్టు8: మండలంలోని దంతనపల్లి సమీపంలో ఉన్న వాగు వద్ద రోడ్డు పూర్తిగా చెడిపోయి గుంతలు పడడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని భావించిన పోలీసులు గుంతలను పూడ్చారు. ఐదేళ్ల క్రితం వచ్చిన వరదలకు వాగు వద్ద రోడ్డుకు గుంతలుపడి ప్రమాదకరంగా తయారైంది. ఈగుంతల వద్ద తరుచూ ప్రమాదాలు జరుగుతూ ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రతినిత్యం ఈరోడ్డు పైన వెళ్లే వందలాది వాహనాల డ్రైవర్లు ప్రజలు సైతం ఇబ్బంది పడుతున్నారు. ఇంత జరుగుతున్నా ఆర్ అండ్‌బీశాఖ అధికారులు రోడ్లకు మరమ్మతులు చేయకపోవడంతో ఉట్నూర్ ఎస్సై మనోహర్ తన సిబ్బందితో వంతెన వద్దకు చేరుకుని దంతనపల్లి మాజీ సర్పంచ్ భూమన్న ఆధ్వర్యంలో ఇటుక బట్టీలలో మిగిలిపోయిన తునకలను తీసుకువచ్చి గుంతపై పోసి మరమ్మతులు చేయడంతో పోలీసుల ఔదార్యంపై ప్రజలు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.



గుంతలను పూడ్చివేయించిన ఎస్సై మనోహర్

శభాష్ పోలీసు అంటున్నారు.

పూడ్చక ముందు రోడ్డుపై పడ్డ గుంత



పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న కళాకారుల బృందం

స్వచ్ఛదనం- పచ్చదనంపై కళాజాతా

భీంపూర్, ఆగస్టు8: మండల కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాజాతా బృందం ఆధ్వర్యంలో డీపీఆర్‌వో తిరుమల ఆదేశానుసారం పాటల రూపంలో స్వచ్ఛదనం-పచ్చదనంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ఫణీంధర్, ఎంపీడీవో గోపాలకృష్ణరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సాయినందా, ఉపాధ్యాయులు, అంగన్వాడిలు సీడం సుజాత, ప్రియ కళాకారులు గుంజల రమేష్, గట్టు వెంకట్రావ్, చాకటి రవి, శ్రీలత, నరసమ్మ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య

నేరడిగొండ, ఆగస్టు 8: ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని విద్యార్థులను కళాశాలకు పంపాలని అధ్యాపకులు కుంభోజి సుభాష్ ఉపేందర్‌రెడ్డి, ప్రవీణ్ అన్నారు. గురువారం మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో విద్యార్థుల తల్లిదండ్రులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోషకులు విద్యార్థులను ప్రతీరోజు కళాశాలకు పంపాలన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో ఉచిత విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ఇందులో గ్రామస్థులు కరణ్‌సింగ్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

చిరుత దాడిలో ఆవు మృతి

బోథ్, ఆగస్టు8: సోనాల మండలంలోని పార్డీబి గ్రామానికి చెందిన రైతు తుడుసం సీతారాంకు చెందిన ఆవు బుధవారం సాయంత్రం చింతల బోరి అటవీ ప్రాంతంలో మేస్తుండగా చిరుత దాడిచేసి చంపేసిందని గ్రామస్థులు తెలిపారు. నష్టపోయిన రైతుకు పరిహారం ఇవ్వాలని కోరుతున్నారు.

ప్రభుత్వ బడిలో పురుగుల బియ్యంతో భోజనం!

● చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు

సిరికొండ, ఆగస్టు8: మండలకేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నిత్యం మధ్యాహ్న భోజనంలో పురుగులు పట్టిన దొడ్డు బియ్యాన్ని పెడుతున్నారని విద్యార్థుల తల్లిద్రండులు గురువారం ఆందోళనకు దిగారు. ఈ విషయం తమ పిల్లలు తమకు చెప్పడంతో తెలిసిందని, ఈ విషయాన్ని గ్రామస్థులు, వంట కార్మికులు పలుమార్లు ప్రధానోపాధ్యాయుడి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వారు పేర్కొన్నారు. ఉన్న బియ్యాన్నే వండిపెట్టాలని ఆదేశించడంతో చేసేదేమీ లేక అవే బియ్యాన్ని వండి పెడుతున్నామని వంట కార్మికులు తెలిపారు. ఈ బియ్యాన్ని వండి పెడితే తమ పిల్లల ఆరోగ్యంపై ప్రభావం పడే అవకాశం ఉందని, అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలి

● ఉట్నూర్‌లో విధుల బహిష్కరణ, ధర్నా

ఉట్నూర్, ఆగస్టు8: వృత్తిధర్మంలో న్యాయం కోసం పాటు పడుతున్న న్యాయవాదులకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలుచేయాలని ఉట్నూర్ జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసనధర్నా నిర్వహించారు. గురువారం ఉట్నూర్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భానోత్‌జగన్ ఉపాధ్యక్షుడు దీరజ్ గుప్తా ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించి మాట్లాడారు. గత 5న జనగామలో న్యాయవాద దంపతులపై పోలీసుల దౌర్జాన్యానికి నిరసనగా బార్ అసోసియేషన్ న్యాయవాదులు విధులు బహిష్కరించి కోర్టు ఎదుట నిరసనవ్యక్తం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కోశాధికారి చింతలగిరి,న్యాయవాదులు బానోత్ జైవంత్‌రావు, పవార్ వసంత్‌రావు, కుడెల్లి అశోక్, నాతరి రాజు తదితరులు పాల్గొన్నారు.

మానవ మనుగడకు చెట్లు కీలకం : బీజేఎల్పీ నేత ఏలేటి

సారంగాపూర్ రూరల్, ఆగస్టు 8 : మానవ మనుగడకు చెట్లు కీలకమైనవని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చించోలి(బి) గ్రామ సమీపంలో గల గండి రామన్న హరితవనంలో వన మహోత్సవంలో భాగంగా హరితవనంలో మొక్కలను నాటి ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పర్యావరణాన్ని కాపాడడంతో పాటు చెట్లను కాపాడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. గ్రామాల్లో మొక్కల ప్రాముఖ్యతను వివరిస్తూ వాటి వల్ల ప్రయోజనాలను తెలియజేయాలన్నారు. అనంతరం ఆయనను అటవీ శాఖ అధికారులు శాలువాతో సన్మానించి మొక్కను బహుమానంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సీసీఎఫ్ శర్వానన్‌తో పాటు అటవీ శాఖ అధికారులు ఉన్నారు.



హరితవనంలో మొక్కలు నాటుతున్న బీజేఎల్పీ నేత ఏలేటి

'ఇథనాల్ పరిశ్రమ నిర్మాణాన్ని నిలిపివేయాలి'



ఇథనాల్ వ్యతిరేక పోరాట సమితి సభ్యులకు మద్దతు ప్రకటిస్తున్న సీపీఐఎం, ప్రజా సంఘాల నాయకులు

దిలావర్‌పూర్, ఆగస్టు 8 : మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఇథనాల్ పరిశ్రమను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్న దిలావర్‌పూర్ గ్రామస్థులకు సీపీఐఎం, ప్రజా సంఘాలు మద్దతు ప్రకటించాయి. గురువారం రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని సందర్శించిన సీపీఐఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు డాకూర్ తిరుపతి, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు తొడసం శంభు గ్రామస్థులను ఉద్దేశించి మాట్లాడారు. మండల కేంద్రంలో నిర్మాణం అవుతున్న ఇథనాల్ పరిశ్రమను రద్దు చేయాలని కోరుతూ గత 15 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నప్పటికీ అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా పరిశ్రమలు నిర్మిస్తూ బతుకుదెరువును బజారు కీడుస్తోందన్నారు. రైతాంగానికి, ఆ గ్రామ ప్రజలకు నష్టం చేసే ఇథనాల్ పరిశ్రమను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. వెంటనే ఇథనాల్ పరిశ్రమను మండలం నుంచి తరలించాలని సీపీఎం, ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి.

బీరవెల్లిలో చోరీ చేసిన వ్యక్తిని పట్టుకున్న పోలీసులు

సారంగాపూర్ రూరల్, ఆగస్టు 8 : మండలంలో గల బీరవెల్లి గ్రామానికి చెందిన ఒన్నే సుధాకర్ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు గత రెండు రోజుల క్రితం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీఐ రామకృష్ణ, ఎస్సై శ్రీకాంత్‌లు నూతన సాంకేతికత ద్వారా దర్యాప్తు చేయడంతో గురువారం గ్రామంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తి పరమేశ్వర్‌ను పోలీసులు పట్టుకొని వివరాలను సేకరించినట్లు డీఎస్పీ గంగారెడ్డి తెలిపారు. అనంతరం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గత రెండు రోజుల క్రితం బీరవెల్లి గ్రామానికి చెందిన ఒన్నే సుధాకర్ ఇంట్లె ఎవరు లేని సమయంలో ఇంటి తాళాలను పగలకొట్టి ఇంట్లోకి చొరబడి ఇంట్లో ఉన్నటువంటి ఏడు తులాల బంగారంతో పాటు రూ. లక్ష 50 వేలను దొంగలించినట్లు తెలిపారు. దొంగలించినటువంటి వస్తువులతో పాటు లక్ష 50 వేలను రికవరీ చేసి చోరీ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



లక్ష్మణచాందలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

లక్ష్మణచాంద, ఆగస్టు 8 : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో రాధ రాథోడ్ అన్నారు. మండల కేంద్రంలోను, రాచాపూర్ గ్రామంలోను గురువారం పర్యటించారు. స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా 'స్వచ్ఛ్ రాఖీ - చేయి చేయి కలుపుదాం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం' అనే ప్రధాన టైటిల్‌తో కూడిన బ్యానర్లతో ప్రదర్శన చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి, జ్వరాల వివరాలను తెలుసుకున్నారు. అలాగే లక్ష్మణచాందలోని పలు దుకాణాల పరిశుభ్రతను తనిఖీ చేశారు. దుకాణాల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని, నాణ్యమైన పదార్థాలను ప్రజలకు అందించాలని యజమానులకు ఆదేశించారు. అనంతరం రాచాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో డ్రై డేను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి ప్రత్యూష, పంచాయతీ కార్యదర్శి విక్రమ్‌రాజ్, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులపై సోషల్ ఆడిట్

నర్సాపూర్(జి), ఆగస్టు 8 : మండల కేంద్రంలోని మేజర్ గ్రామపంచాయతీ ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనులు, ఖర్చులను సోషల్ ఆడిట్ బృందం పనులను ధృవీకరించారు. షీట్‌లో సూచించిన విధంగా పనులను పరిశీలించి బృందం సభ్యుడు రాజాబాబు నోట్ చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వీణారెడ్డి, ఉపాధిహామీ పథకం సిబ్బంది విట్టల్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.




వ్యవసాయ పరిశోధన స్థానంలో వన మహోత్సవం

ముథోల్, ఆగస్టు 8 : మండల కేంద్రంలోని ఏరువాక వ్యవసాయ పరిశోధన స్థానంలో గురువారం శాస్త్రవేత్తలు వన మహోత్సవ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పలు రకాల మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ కార్తీక్‌తో పాటు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ కృషి



తానూర్, ఆగస్టు 8 : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ ద్వారా కృషి చేయడం జరుగుతుందని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బీ.వీ రమణారావు అన్నారు. గురువారం మండలంలోని బేల్‌తరోడా, తానూర్, బోరిగాం, భోసి, పాఠశాలలో పీఆర్‌టీయూ సంఘ సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడానిక పీఆర్‌టీయూ ఎల్లప్పుడు ముందుంటుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పీఆర్‌టీయూ సంఘ సభ్యులున్నారు.



» తరాలు గడుస్తున్నా మారని ఆదివాసీల బతుకులు » ఎస్టీ వర్గీకరణ తీర్పుతో స్వల్ప ఊరట
» మళ్లీ ఉద్యమం వైపు మాజీ ఎంపీ సోయం అడుగులు » వెంటాడుతున్న నిరక్షరాస్యత, అనారోగ్య సమస్యలు
» నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

మారని తలరాతలు!

ఆదిలాబాద్, ఆగస్టు8 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి అస్థిత్వం కోసం నిరంతర ఉద్యమాలు చేస్తున్నా ఆదివాసీలు అభివృద్ధికి ఇంకా ఆమడ దూరంలోనే ఉన్నారు. జల్.. జంగిల్.. జమీన్.. అనే నినాదంతో పోరాటాలు చేసిన కొమురంభీం స్ఫూర్తిగా ఆదివాసీలు ఉద్యమాలకు సిద్ధమవుతున్నారు. నిరంతరంగా తమ హక్కుల కోసం గళమెత్తి పోరాడుతున్నా తలరాతలు మాత్రం మారడంలేదంటున్నారు. స్వాతంత్రం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా కనీస వసతులకు నోచుకోవడమే లేదు. నేటికీ జిల్లాలోని ఏజెన్సీ మారుమూల గ్రామాలకు రవాణా, విద్యుత్ సౌకర్యానికి నోచుకోవడం లేదు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా జిల్లాలోనే ఆదివాసీ జనాభా అధికంగా నివసిస్తున్నారు. తమ వెనుకబాటు తనానికి మరోగిరిజన తెగనే కారణమంటూ గత కొన్నేళ్లుగా ఆందోళనలు, ఉద్యమాలు చేస్తూ పోరుబాట పట్టిన ఆదివాసీల భవిష్యత్తు ప్రశ్నార్థకంగానే మారుతోంది. ముఖ్యంగా ఎస్టీ జాబితా నుంచి లంబాడాలను తొలగించాలంటూ పట్టుబట్టి ఉద్యమాలు చేస్తున్న ప్రభుత్వాలు పట్టించుకోవడమే లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అవకాశాలన్నీ లంబాడా తెగకే దక్కడంతో తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆదివాసీలు మండిపడుతున్నారు. ఆదివాసీల రక్షణకు ఎన్నో ఏజెన్సీ చట్టాలు ఉన్న అమలు చేయడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతూనే ఉన్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి. గత కొన్నేళ్లుగా ఏజెన్సీలో గిరిజన తెగల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతున్నా సమస్య పరిష్కారానికి ప్రభుత్వాలు చర్యలు తీసుకోవడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆదివాసీల జీవనాన్ని మెరుగు పరిచేందుకు ఐక్యరాజ్య సమితి 1982 ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీల దినోత్సవంగా ప్రకటించింది. అప్పటినుంచి ప్రతీయేడు ఆగస్టు 9న ఆదివాసీలు ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవడం అనవాయితీగా వస్తోంది. శుక్రవారం జిల్లావ్యాప్తంగా ఆదివాసీ దినోత్సవాన్ని పెద్ద ఎత్తున జరుపుకునేందుకు ఆదివాసీ సంఘాలనేతలు సిద్ధమవుతున్నారు.

• చిగురిస్తున్న ఆశలు

గత కొన్నేళ్లుగా ఆదివాసీలు తమ హక్కుల కోసం పోరాటాలు చేస్తున్న ఆశించిన ప్రయోజనం దక్కడం లేదంటున్నారు. ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన వర్గీకరణ తీర్పు కొంత ఊరటనిచ్చిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాజ్యాంగ బద్ధంగా దక్కాల్సిన ప్రభుత్వ పథకాలు తమకు అందడం లేదంటున్నారు.ఆదివాసీలు చేస్తున్న పోరాటాలను గుర్తించిన న్యాయస్థానం గిరిజనుల్లో వర్గీకరణ అవసరమేనని అభిప్రాయపడింది. వర్గీకరణ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందంటూ పేర్కొనడంపై ఆదివాసీల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. ఎస్టీ జాబిత నుంచి లంబాడాలను తొలగించాలంటూ ఎన్నో పోరాటాలు చేస్తూ వస్తున్న ఆదివాసీల ముందుకు వర్గీకరణ అంశం రావడంతో హర్షం వ్యక్తమవుతోంది. వర్గీకరణతోనైనా కొంతవరకు న్యాయం జరిగే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. న్యాయస్థానం సూచించిన విధంగా వర్గీకరణ చేపట్టి వెనుక బడిన ఆదివాసీ ఉపకులాలకు న్యాయం జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆదివాసీలు డిమాండ్ చేస్తున్నారు.

• తుడుం మోగించే ప్రయత్నం

సుప్రీం కోర్టు తీర్పుకు అనుగుణంగా రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీలు తుడుం మోగించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఆదివాసీల ఉద్యమంవైపు మళ్లీ మాజీ ఎంపీ సోయం బాపురావ్ అడుగులు వేస్తున్నారంటూ ప్రచారం జరుగుతోంది. గతంలో మాదిరిగానే ఉద్యమాన్ని రగిలించి హక్కులు సాధించుకోవాలని ఆదివాసీలు భావిస్తున్నారు. సోయంనాయకత్వంలోనే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని ఆదివాసీ పెద్దలు నిర్ణయించినట్లు సమాచారం. తుడందెబ్బ ఉద్యమకార్యాచరణను ఉధృతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. త్వరలోనే వర్గీకరణతోపాటు జీవో నెంబర్3 పునరుద్ధరణ, పోడుభూముల సమస్య, విద్య, వైద్యం, పలు సమస్యలపై పెద్దఎత్తున ఉద్యమాలు చేసేందుకు ఆదివాసీలు సిద్ధమవుతున్నారు. తుడందెబ్బకు మళ్లీ సోయం బాపురావు నాయకత్వం వహించే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఆదివాసీ సంఘాల ఒత్తిడితో మాజీ ఎంపీ సోయం బాపురావ్ ఉద్యమబాటలో కలిసి నడిచేందుకు సిద్ధం అవుతున్నారన్న టాక్ వినిపిస్తుంది.



• గాలిలో కలుస్తున్న ప్రాణాలు

జిల్లాలోని ఎన్నో మారుమూల గిరిజన గ్రామాలకు ఇప్పటికీ కనీస రోడ్డు, రవాణా సౌకర్యం లేక అత్యవసర సమయంలో దేవుడెదిక్కన్న పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా వర్షాకాలం వచ్చిందంటే చాలు ఆదివాసీ గ్రామాలకు వణుకు మొదలవుతుంది. చిన్నపాటి వర్షాలకే వాగులు, వంకలు పొంగి ప్రవహించడంతో ఊరుదాటి బయటకు వెళ్లే పరిస్థితులు కనిపించడం లేదు. అత్యవసర సమయంలో వైద్యం అందక యేటా ఎందరో మంది ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. ముఖ్యంగా ఆదివాసీ మహిళలనురక్తహీనత సమస్య వెంటాడుతునే ఉంది. వీరికి ప్రసవమంటే పునర్జన్మగా మారుతోంది. సరైన వైద్యం అందక పోవడంతో మాతా శిశు మరణాల రేట్లు పెరగడం ఆందోళన రేపుతుంది. ఆదివాసీలు ఆచార సాంప్రదాయాలకుకట్టుబడి మూఢ విశ్వాసాలతో జీవనం సాగిస్తున్నారు. అలాగే తరతరాలుగా వెంటాడుతున్న రక్తహీనత, పౌష్టికాహార లోపంతో ఆదివాసీలు బక్కచిక్కి పోయి బలహీన పడిపోతున్నారు. దీంతో భయంకర వ్యాధులు చుట్టుముట్టి యేటా ఎందరో మంది మృత్యువాత పడుతున్నారు. ఇలా తీవ్ర అనారోగ్యం, పేదరికం, ఆర్థిక సమస్యలతో ఆదివాసీలు సతమతమవుతున్నారు. చదువుకోవాలన్న ఆశ ఉన్న ఉన్నత విద్య అవకాశాలు అందుబాటులో లేక పోవడంతో ఊరికే పరిమితమవుతున్నారు. దూరప్రాంతాలకు వెళ్లి చదువుకునే స్థోమతలేక వ్యవసాయ పనులకు పరిమితమవుతున్నారు. దీంతో ఆదివాసీలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. మెరుగైన విద్యవైద్యాన్ని అందిస్తే ఆదివాసీలు అందరితో కలిసిసమానంగా అభివృద్ధి చెందే అవకాశాలు లేక పోలేదంటున్నారు.

జాతి కోసం ఏ పోరాటానికైనా సిద్ధమే..

• సోయం బాపురావ్ (మాజీ ఎంపీ, ఆదిలాబాద్)

తమ జాతిహక్కుల కోసం ఏ పోరాటానికైనా నేను సిద్ధం. ముందు నుంచి పోరాటాలతోనే హక్కులను సాధించుకుంటున్నాం. ఆదివాసీలకు ఉద్యమాలు చేయడం కొత్తేమీ కాదు. కొమురంభీం స్ఫూర్తితో మరిన్ని ఉద్యమాలను చేపడుతాం. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీలను మోసం చేస్తూనే ఉన్నాయి. ఇటీవల ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పుతో ఆదివాసీలకు కొంతవరకు న్యాయం జరిగే అవకాశం ఉంది. కానీ ఎస్టీ జాబితా నుంచి లంబాడాలను తొలగిస్తేనే పూర్తిస్థాయిలో ఆదివాసీలకు న్యాయం జరుగుతుందని భావిస్తున్నాం. ఈ దిశగా మరిన్ని ఉద్యమాలు, పోరాటాలు చేస్తాం. రాజ్యాంగబద్ధంగా ఆదివాసీలకు దక్కాల్సిన హక్కులను సాధించుకుని తీరుతాం.




నాగుల పంచమికి ముస్తాబైన నాగోబా ఆలయం, పక్కన గర్భగుడిలో నాగోబా విగ్రహం

నాగుల పంచమికి
నాగోబా ఆలయం ముస్తాబు

• మినీ జాతరకి అన్ని ఏర్పాట్లు పూర్తి

ఇంద్రవెల్లి, ఆగస్టు8: ఆదివాసీల ఆరాధ్యదైవం, రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన కేస్లాపూర్ నాగోబా ఆలయంలో జరిగే నాగులపంచమి ఉత్సవాలకు ఆలయం ముస్తాబైంది. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా సుందరంగా నిర్మించిన ఆలయంలో ప్రతీయేటా నాగుల పంచమి ఉత్సవాలు నిర్వహిస్తారు. శనివారం, ఆదివారం రెండురోజులు నిర్వహించే ఉత్సవాలకు ఆలయంవద్ద అన్నిఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్రావుపటేల్ తెలిపారు. నాగులపంచమి సందర్భంగా దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యాల కోసం ఆలయ కమిటీతో పాటు మెస్రం వంశీయులు, గ్రామస్తులు అధ్వర్యంలో అన్నిఏర్పాట్లను పూర్తి చేశారు. భక్తులకోసం ప్రత్యేక దుకాణాలు, స్టాల్‌తో పాటు రంగులరాట్నాలు, చిన్న పిల్లలు ఆడుకునే ఆటలను సైతం మినీజాతరలో వెలిశాయి. నిర్వాహకులు కబడ్డీ, వాలీబాల్ పోటీలను సైతం నిర్వహించనున్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

• ప్రతీ కళాశాల, పాఠశాలలో యాంటీ ర్యాగింగ్ కమిటీ: జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం

ఆదిలాబాద్ అర్బన్, ఆగస్టు 8: విద్యాసంస్థల్లో ర్యాగింగ్ పాల్పడిన వారిపై కఠినచర్యలు తప్పవని ఎస్పీ గౌస్‌ఆలం ఐపీఎస్ తెలిపారు. గురువారం జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయం నుంచి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లావ్యాప్తంగా అన్ని కళాశాలు, పాఠశాలల్లో యాంటీర్యాగింగ్ కమిటీలను ఏర్పాటుచేసి విద్యార్థుల పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. కళాశాలలో, పాఠశాలలో నూతనంగా వచ్చినవారిపై ర్యాగింగ్‌కు పాల్పడడం చట్టరీత్యా నేరమని, వారిపై ర్యాగింగ్‌కు సంబంధించిన కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కేసులు నమోదైతే ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రైవేట్ ఉద్యోగాలకు కష్టతరం, అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడవద్దని తెలిపారు. యజమానులు విద్యాసంస్థల్లో విద్యార్థులకు ర్యాగింగ్‌పై అవగానను, వాటికల్ల కలిగే పరిణామాలపై చైతన్య పరచాలని సూచించారు. ఎటువంటి అత్యవసర సమయంలోనైనా డయల్ 100కు ఫోన్ చేస్తే తక్షణం పోలీసుసిబ్బంది తమవద్ద ఉంటుందని, ర్యాగింగ్‌పై అవగాహన కల్పించేందుకు జిల్లాపోలీసుల తరఫున అన్ని విద్యా సంస్థలలో చైతన్యపరిచే కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న గ్రామస్థులు

హైడల్ ప్రాజెక్టు మాకు వద్దు

• తహసీల్దార్‌కు వినతిపత్రం

నేరడిగొండ, ఆగస్టు8: మండలంలోని కడెం వాగుపై కుప్టి గ్రామం వద్ద నిర్మించనున్న హైడల్ ప్రాజెక్టు తమకు వద్దని కుప్టి(కె) గ్రామస్థులు గురువారం తహసీల్దార్ ఎంఎ కలీంకు వినతిపత్రాన్ని అందజేశారు. కుప్టి ప్రాజెక్టులో తమ గ్రామాన్ని ముంపులో చూపించలేదని పూర్తిగా ముంపునకు గురవుతున్నా తమను ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపించారు. సంబంధిత అధికారులు తమ గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించాకే ప్రాజెక్టు పనులు ప్రారంభించాలని గ్రామస్థులు కోరారు. ఈ విషయమై ఉన్నతాధికారులతో మాట్లాడుతామని తహసీల్దార్ అన్నారు. కార్యక్రమంలో యూడీసీ అధ్యక్షుడు నవీన్‌చారి, బొమ్మెన వెంకటరమణ, మెట్టు శ్రీధర్, బాధ వెంకటరమణ, గ్రామస్థులు తదితరులున్నారు.

మిషన్ శక్తితో మహిళలు, యువతులకు రక్షణ

ఇంద్రవెల్లి, ఆగస్టు8: మహిళలు, యువతులు, బాలికల రక్షణ, అభివృద్ధికి జిల్లా శిశు, మహిళా సంక్షేమశాఖ- మహిళా సాధికారత కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో మిషన్‌శక్తి 100 రోజుల ప్రత్యేక సంయుక్త అవగహన కల్పిస్తున్నట్లు డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్ యశోద్, సఖి కేంద్రం నిర్వాహకురాలు సరస్వతిలు తెలిపారు. గురువారం మండలంలోని గలియాబాయి తండాలో మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాలికల రక్షణ, విద్య, బేటిబచావో, బేటిపడావో, పిల్లలపై లైంగిక వేధింపులు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కెరీర్ గైడెన్స్, సైబర్ క్రైమ్, మాదక ద్రవ్యాల నిర్మూలన, సోషల్ మీడియా నుండి వచ్చే సమస్యలు, బాల్య వివాహాల నియంత్రణ ఇతర మహిళాసంక్షేమ అంశాలను వివరించినట్లు చెప్పారు.

స్వచ్ఛదనం-పచ్చదనంలో అందరూ భాస్వాములు కావాలి

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 8: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో ప్రతీఒక్కరు భాగస్వాములు కావాలని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి పేర్కొన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆదిలాబాద్ పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగింది. పరిసరాల పరిశుభ్రతను ప్రతీఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ ఖమర్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

దోమల నివారణకు చర్యలు

ఆదిలాబాద్‌రూరల్, ఆగస్టు 8: మున్సిపల్ పరిధిలోని వార్డుల్లో దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎమ్‌డీ ఖమర్ అహ్మద్ పేర్కొన్నారు. గురువారం ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని వార్డ్ నెంబర్ 27 లో ఆయన పర్యటించారు. ఈ మేరకు స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక చెరువులు గుంబూషియా చేపలను వేశారు. కార్యక్రమంలో జోగు శైలజ రవి, సానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేందర్, మెప్మా, టీఎంసీ భాగ్య లక్ష్మి పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు8: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని ఆదిలాబాద్ మున్సిపల్ ఖమర్ అహ్మద్ అన్నారు. గురువారం పట్టణంలోని ఖానాపూర్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల కోసం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పాల్గొని మాట్లాడారు. ఇంట్లో ఏ విధంగా అయితే పరిశుభ్రత పాటిస్తామో బయట కూడా అదేవిధంగా పరిశుభ్రత పాటించాలని విద్యార్థులకు సూచించారు. జిల్లా టూరిజం ఆఫీసర్ రవి కుమార్ పాల్గొన్నారు.

విధులను బహిష్కరించిన న్యాయవాదులు

ఆదిలాబాద్‌రూరల్, ఆగస్టు8: జనగామలో న్యాయవాద దంపతుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును నిరసిస్తూ ఆదిలాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు నగేష్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. గురువారం న్యాయవాదులు తమ విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు నగేష్ మాట్లాడుతూ జనగామ ఘటనలు కంటిచూపు చర్యగా కేవలం ఎఫ్ఆర్ చేయడాన్ని ఖండించారు. వెంటనే ఆ పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉంచొద్దు

ఆదిలాబాద్‌రూరల్, ఆగస్టు8: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతిఒక్కరు జాగ్రత్తలు పాటించాలని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ సూచించారు. గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని ఖాళీ స్థలాల్లో నీరునిల్వ ఉన్నచోట గుంబూషియా చేపలను వేశారు. ఈసందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ దోమలు వృద్ధి చెందకుండా ఉండాలంటే ప్రజలు తమ పరిసరాల్లో నీరునిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు వైసీ శ్రీనివాస్, శ్రీధర్, సిబ్బంది అనిల్ పాల్గొన్నారు.

'ఉద్యోగులకు అండగా పీఆర్టీయూ'

నేరడిగొండ, ఆగస్టు8: పీఆర్టీయూ టీఎస్ సంఘం ప్రతీ ఉద్యోగికి అండగా ఉంటుందని ఆ సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం నేరడిగొండ మండల కేంద్రంతో పాటు వడూర్ గ్రామంలో గల ప్రభుత్వపాఠశాలలోని ఉపాధ్యాయుల సభ్యత్వనమోదు చేపట్టారు. పలువురు పీఆర్టీయూ నాయకులు బదిలీపై నేరడగొండకు రావడంతో వారిని శాలువ, పూలమాలలతో సత్కరించారు.

స్వచ్ఛదనం-పచ్చదనంతోనే ఆరోగ్యం

• ఖానాపూర్ శాసనసభ్యుడు వెడ్మబొజ్జు పటేల్

ఉట్నూర్, ఆగస్టు 8: ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసమే రాష్ట్రప్రభుత్వం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ప్రారంభించిందని ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. గురువారం మండలంలోని దంతన్‌పల్లి ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మండల ప్రత్యేకాఅధికారి సుధాకర్, ఎంపీడీవో రాంప్రసాద్‌లు ఏర్పాటుచేసిన కార్యక్రమానికి హాజరై ముందుగా పాఠశాల ఆవరణలో కిచెన్‌గార్డెన్ ప్రారంభించిన అనంతరం మొక్కలునాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాకాలం వ్యాధులకాలమని అందరికీ తెలిసినా నిర్లక్ష్యం చేస్తూ ఉంటారని, యేడాదిలో కేవలం 4నెలలపాటు ప్రజలందరూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకొని ఇళ్లలో ఉన్న పనికిరాని వస్తువులను దూరంగా పారేయడంతో వ్యాధుల నుంచి తమను తాము కాపాడుకోలేకపోతున్నారని అన్నారు. ఇంటి పరిసరాల్లో మురికి కాలువలు, మురికిగుంటలు ఉంటే డెంగ్యూ, మలేరియా లాంటి వ్యాధులు సంక్రమిస్తాయని అన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉంటే వ్యాధులు రావని వివరించారు. చెట్లు ఉంటేనే వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని అన్నారు. అటవీశాఖ ఆధ్వర్యంలో అడవుల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలకు అండగా నిలవాలన్నారు. ఉట్నూర్, నార్నూర్, జైనూర్ ప్రాంతాలలో ఉన్న ఆసుపత్రుల్లో వైద్యుల సమస్య ఉందని, పక్షం రోజుల్లో సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా వ్యాసరచన పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు భూమేష్, రాజేశ్వర్లకు ఎమ్మెల్యే బహుమతులు అందించారు. కార్యక్రమంలో సింగిల్విండో చైర్మన్ ఎస్సీరెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు లింగంపల్లి చంద్రయ్య, ఎఫ్ఆర్ఓ అరుణ, సీడీపీఓ మాస ఉమా, డాక్టర్ అనురాధా, తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల ఆవరణలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

నేరడిగొండ, ఆగస్టు 8: మండలంలోని గొలిగూడ గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ దినేష్ భార్య ఇటీవల మృతిచెందగా విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నాయకులు దేవేందర్‌రెడ్డి, ప్రతాప్‌సింగ్ సవాయిరాం, రమేష్, తదితరులున్నారు.

వ్యాధులపై ఇంటింటా సర్వే

బోథ్, ఆగస్టు 8: మండలకేంద్రంలో వ్యాధులపై ఇంటింటా సర్వేను నిర్వహించారు. ప్రతీ ఇంటికి వెళ్లి వారి ఇళ్లలో ఎవరైనా ఆరోగ్య సమస్యతో బాధపడుతున్నారా..? ఏ వ్యాధులతో బాధపడుతున్నారు.. అనే వివరాలను సేకరించారు. నివారణకు చేపట్టే చర్యల గురించి వివరించారు. ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండ కుండా చూసుకోవాలని సూచించారు. ఆరోగ్య జాగ్రత్తలను పాటించాలని వివరించారు.

పిల్లలను పాఠశాలకు విధిగా పంపాలి

• పర్యావరణ పరరక్షణ ప్రతీఒక్కరి బాధ్యత • స్వచ్ఛదనం - పచ్చదనంలో కలెక్టర్ రాజార్షిషా • మధ్యాహ్న భోజనం పరిశీలన

జైనథ్, ఆగస్టు 8: పిల్లలను ప్రతీరోజు పాఠశాలకు పంపడం విధిగా భావించాలని కలెక్టర్ రాజార్షిషా తల్లిదండులను కోరారు. గురువారం స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కాన్పమేడిగూడ (ఆర్) గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులకు బోధిస్తున్న తీరును పరిశీలించి విద్యార్థులకు ప్రశ్నలు వేసి జవాబులను రాబట్టారు. పాఠశాలరికార్డులు బోధన సిబ్బందితో పాటు మధ్యాహ్న భోజనాన్ని, అమ్మ ఆదర్శ పాఠశాల కింద జరుగుతున్న గదుల నిర్మాణాలను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థుల చదువుపై ప్రత్యేకశ్రద్ధ వహించాలని కలెక్టర్ ఉపాధ్యాయులకు సూచించారు. కలెక్టర్ పాఠశాలల ఆవరణ విద్యార్థులతో కలిసి మొక్కలునాటి వాటికి నీరు పోశారు. కార్యక్రమంలో జైనథ్ మండల ప్రత్యేకాధికారి వైసాంబశివరావ్, ఎంపీడీఓ రవీంద్రనాథ్, జైనథ్ తహసీల్దార్ శ్యాంసుందర్, ఏపీఈఓ వెంకట్‌రాజ్, ఏపీఎం భగవంత్లు, వీడీసీ చైర్మన్ క్యాతంరాంరెడ్డి, విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మొక్కను నాటిస్తున్న కలెక్టర్



సాత్నాలలో కర్జురపు చెట్టును నాటుతున్న దృశ్యం

• పర్యావరణ పరిరక్షణ ప్రతీఒక్కరి బాధ్యత

జిల్లాలోని పర్యావరణ పరిరక్షణకు సమాజంలోని ప్రతీఒక్కరు తమవంతు బాధ్యతగా మొక్కలు నాటాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజార్షిషా అన్నారు. గురువారం మండలంలోని మధ్యతరహా ప్రాజెక్టు సాత్నాల పరిసర ప్రాంతాల్లో జిల్లా ఎక్సైజ్‌శాఖ, గౌడకులస్థులతో కలిసి కలెక్టర్ రాజార్షిషా వెయ్యి ఈత (కర్జురం) చెట్లను నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ మొక్కలను నాటడం ద్వారా గౌడ కులస్థులకు తమవృత్తి ప్రోత్సాహంతోపాటు ఉపాధి దక్కుతుందన్నారు. ఏ పరిసరాల్లో ఎలాంటి మొక్కలను నాటిన వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని కలెక్టర్ సూచించారు. ఈ మొక్కల కంపౌండ్‌కు అయ్యే ఖర్చుకు నిధులు మంజూరు చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సాంబశివరావ్, జైనథ్ మండల తహసీల్దార్ శ్యాంసుందర్, ఎంపీడీఓ ఎ.రవీంద్రనాథ్, ఎంపీఈఓ వెంకట్‌రావ్, ఆదిలాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ హిమాశ్రీ, సీఐ విజందర్, గౌడ కులస్థులు, ఎక్సైజ్ సిబ్బంది, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: ప్రతీఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం స్వచ్ఛదనం-పచ్చదనంలో ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని యాపల్‌గూడలోని సెకండ్ బెటాలియన్‌లో వనమహోత్సవం నిర్వహించారు. బెటాలియన్ నితిక పంత్ అతిథులను స్వాగతం పలికి సన్మానించారు. కలెక్టర్ ఎస్పీ గౌస్ ఆలం, డీఎఫ్ఓ ప్రశాంత్ బాజీరావ్‌తో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా బెటాలియన్ సిబ్బంది, విద్యార్థులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.



మేడిగూడలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్